# సబ్బండనాదం

తెలుగుదినపత్రిక

PUBLISHED: SANGAREDDY | సంపుటి: 1 | సంచిక: 16 | శుక్రవారం, 17 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : ముద్దంగుల ఎల్లయ్య | పేజీలు: 4 | వేల: 3/-










## మత్తు మందు చల్లి.. సినీ ఫక్కీలో రూ.10 లక్షల చోరీ



## డగ డగ డగ డగ.. ఈ శబ్దం ఉండదిక!

- రైల్వే లైన్లో కంపోజిట్ స్లీపర్లకు ప్రాధాన్యం మరింత భద్రత కోసం పట్టాలకు ఏఐ కవచం
- హైదరాబాద్: వేగంగా వెళ్తున్న రైలులో కుదుపులు... పట్టాల నుంచి డగడగ



## తెలంగాణలో 78 శాతం కుటుంబాల ఆదాయం రూ.లక్షలోపే

- తెలంగాణలో కులగణన రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయి.
- రాష్ట్రంలోని 78 శాతం కుటుంబాలకు ఆదాయం ఏడాదికి రూ. లక్ష కంటే తక్కువగానే ఉందని తెలిపింది.
- అదే సమయంలో తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలు.. అగ్రవర్ణాల కంటే 3 రెట్లు వెనుకబడి ఉన్నాయని తేలింది.
- అదే సమయంలో మొత్తం 242 కులాలు అందులో 135 కులాలను అత్యంత వెనుకబడినవిగా గుర్తించారు.




తెలంగాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుకబడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది.

## మైనింగ్ కొండంత.. ఆదాయం అంతంత



- మైనింగ్ మాఫియా దోపిడీ...
- ఖజానాకు వేల కోట్ల గండి!
- లీజులు ఒకటే... తవ్వకాలు ఇంకోటే: ప్రభుత్వ భూములపై దండయాత్ర
- ఒకే పాస్‌తో పదే పదే రవాణా... రాయల్టీ ఎగవేత బహిరంగం
- మూడేళ్లలో ఆదాయం అర్ధం... గనుల శాఖ చేతులెత్తేసిందా?
- అధికారుల అండతో అక్రమాలు రెచ్చిపోతూ... పర్యావరణం బలికావుతోంది!


## తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య
- తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్
- బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న



## తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- రానున్న రెండు రోజుల్లో పలు జిల్లాల్లో మరింత పెరగనున్న ఎండలు
- మేడ్చల్, హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బయటకు వెళ్లొద్దంటున్న వైద్య నిపుణులు



## స్టాండప్ కమెడియన్ అనుదీప్ పై చర్యలు తీసుకోవాలంటూ హైదరాబాద్ సీపీ సజ్జనార్ కు ఫిర్యాదు

- స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికలపై పోలీసులకు ఫిర్యాదు
- పవన్ కల్యాణ్, రామ్ చరణ్, నిహారికలపై అనుచిత వ్యాఖ్యల ఆరోపణ
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసుల హామీ
- మెగా ఫ్యామిలీపై వ్యక్తిగత దాడులు చేస్తే సహించేది లేదన్న చిరంజీవి యువత




స్టాండప్ కామెడీ పేరుతో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రామ్ చరణ్, నిహారిక వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కమెడియన్ అనుదీప్ కటికలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మెగా అభిమాన సంఘాల నేతలు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన అఖిల భారత చిరంజీవి యువత, తెలంగాణ చిరంజీవి యువత ప్రతినిధులు నేడు వీసీ సజ్జనార్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, తెలంగాణ చిరంజీవి యువత అధ్యక్షుడు వెల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు సజ్జనార్ తో సమావేశమై ఫిర్యాదు అందజేశారు. వారి ఫిర్యాదుపై స్పందించిన సజ్జనార్, ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనుదీప్‌తో పాటు మరికొందరు స్టాండప్ కమెడియన్లు కూడా మెగా ఫ్యామిలీని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చిరంజీవి యువత నాయకులు తెలిపారు. ఇకపై మెగా ఫ్యామిలీపై ఎవరైనా వ్యక్తిగత దాడులకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. కామెడీకి, వ్యక్తిగత దూషణలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని వారు స్పష్టం చేశారు. కాగా, స్టాండప్ కమెడియన్ అనుదీప్ ను ఏపీ పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేయడం తెలిసిందే. కుటుంబ సభ్యులను కలవడానికి ప్రయాగ్ రాజ్ వెళ్లిన అతడిని ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల అతడు పవన్, నిహారికల వ్యక్తిగత జీవితాలు, విడాకులపై వ్యంగ్యంగా స్కిట్ చేశాడు. దాంతో అతడిపై మెగా అభిమానులు, జనసైనికులు మండిపడుతున్నారు.

## తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి

- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై ఆగ్రహం
- తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండటమేమిటని ప్రశ్న
- ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని మండిపాటు
- తెలంగాణ వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉందన్న కేటీఆర్
- తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



## తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం



- తిరుమల కొండపై ఓ మోస్తరు రద్దీ
- భక్తులతో నిండిన 18 కంపార్ట్‌మెంట్లు
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 77,077 మంది భక్తులు
- హుండీ ద్వారా రూ.3.47 కోట్ల ఆదాయం

తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తుల రద్దీ ఓ మోస్తరుగా కొనసాగుతోంది. టైమ్ స్లాట్ సర్వదర్శనం (ఎస్ఎస్ డీ) టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 8 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నాటికి, తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 18 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండి ఉన్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

# తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి

బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు.

తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# తెలంగాణలో 78 శాతం కుటుంబాల ఆదాయం రూ.లక్షలోపే

ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది. మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం.. ఎస్సీల్లో 97 శాతం.. బీసీల్లో 71 శాతం మంది ప్రజలు.. తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుకబడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి. ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కువగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహిర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది. అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారని పేర్కొంది. ఇక అగ్రవర్ణాల్లో కూడా దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణాలకు చెందిన వారే కావడం గమనార్హం. సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు విద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య చదువుతున్న వారిలో 57 శాతంతో అగ్రవర్ణాలు ముందుండగా.. 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు ముందంజలో ఉండగా.. ఎస్టీలు 36 శాతానికే పరిమితమయ్యారు.

# తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అవమానించినందుకు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ డీఎన్ఏ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

# తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తెలంగాణలో భానుడు భగభగలాడుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటంతో వాతావరణ శాఖ అత్యంత కీలకమైన హెచ్చరికలను జారీ చేసింది. ముఖ్యంగా నేడు, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీల వరకు పెరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. నేటి నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉంది. ఆరెంజ్ హెచ్చరికలు ఉన్న జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిది. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలపాగా, గొడుగు వంటివి వినియోగించాలని, డీహైడ్రేషన్ కాకుండా తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలని హితవు పలుకుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎండల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# మైనింగ్ కొండంత.. ఆదాయం అంతంత

హైదరాబాద్: రాష్ట్రంలో గనులు, భూగర్భ వనరుల శాఖ పరిధిలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లీజుదారులు అనుమతులను మించి తవ్వకాలు సాగిస్తూ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. తమకు కేటాయించిన భూభాగాన్ని దాటి ప్రభుత్వ, అటవీ, ప్రైవేటు భూముల్లో అక్రమ మైనింగ్కు పాల్పడుతున్నారు. తవ్విన పరిమాణాన్ని తక్కువగా చూపుతూ రాయల్టీ ఎగవేతకు పాల్పడుతున్నారు. ఒకే ట్రాన్సిట్ పాస్, వే బిల్లును పదే పదే ఉపయోగిస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన రూ.వేల కోట్ల ఆదాయం పక్కదారి పడుతుండగా.. పర్యావరణం, భూగర్భజలాలు, పంట పొలాలు, జీవ వైవిధ్యం దెబ్బతింటోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గ్రానైట్, ఇసుక క్వారీలు అధికంగా ఉన్న ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యవస్థీకృతంగా సాగుతున్న మైనింగ్ దోపిడీలో అక్రమార్కులు, లీజుదారులకు కొందరు మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**సగానికి పడిపోయిన ఆదాయం**

రాష్ట్రంలో బొగ్గు, ఇనుము, సున్నపురాయి, మాంగనీస్ వంటి ప్రధాన ఖనిజాలతో పాటు క్వార్ట్జ్, ఫెల్స్పార్, లాటరైట్, డోలమైట్, బారైట్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, మార్బుల్, ఎర్త్, రోడ్ మెటల్స్, గ్రావెల్, సాధారణ ఇసుక వంటి మైనర్ మినరల్స్ (చిన్న ఖనిజాలు) కూడా ఉన్నాయి. గనులు, భూగర్భ వనరుల శాఖ లెక్కల ప్రకారం చిన్న ఖనిజాల కేటగిరీలో ప్రస్తుతం 198 మైనింగ్, 1,644 క్వారీ లీజులు ఉన్నాయి. రాష్ట్ర అవతరణ తర్వాత 2022--23లో రాష్ట్ర ఖజానాకు గరిష్టంగా ఖనిజ ఆదాయం రూ.7,705.53 కోట్లు సమకూరింది. ఆ తర్వాత మూడేళ్లుగా ఖనిజాదాయం శరవేగంగా పడిపోతూ రావడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. గనుల శాఖ ప్రతీ ఏటా ఖనిజాదాయాన్ని రాబట్టేందుకు భారీగా లక్ష్యాలు నిర్దేశించుకుంటున్నా ఆశించిన లక్ష్యం చేరుకోక పోవవడం గమనార్హం. అక్రమాల కారణంగానే ఆదాయానికి గండి పడుతోందని తెలిసినా, లీజు హోల్డర్లు, కొందరు రాజకీయ నాయకులు, రెవెన్యూ, పోలీసు అధికారుల మద్దతుతో ఖనిజాదాయానికి గండి పడుతున్నా మైనింగ్ విభాగం నియంత్రించలేక పోతోంది.

**2025-26 5.3,998.51 5?..!**

2022-23 నాటి ఆదాయంతో పోలిస్తే ఇటీవల ముగిసిన 2025-26 5 ? ? 5.3,998.51 5 ఆదాయం (సుమారు 60%) మాత్రమే వచ్చింది. అంటే మూడేళ్లలో దాదాపు సగానికి రూ.3,707.02 కోట్ల మేర పడిపోయింది. 2023-24లో ఖనిజాదాయంలో ఏకంగా మైనస్ వృద్ధి (-29%) నమోదు కాగా 2024-25లో స్వల్పంగా మెరుగు పడి 1.24 శాతానికి చేరుకున్నా... 2022-23 నాటి ఆదాయం రూ.7,705 కోట్లతో పోలిస్తే -27.5%గా నమోదు అయ్యింది. ఇక ఈ ఏడాది మార్చి నాటికి ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు -40%తో ఖనిజాదాయం వృద్ధి రేటు మరీ క్షీణించింది. ఇదిలావుంటే 2026--27లో గనులు, భూగర్భవనరుల ద్వారా రూ.7,150 కోట్ల ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకోవడం గమనార్హం.

# తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం

నిన్న (ఏప్రిల్ 15) ఒక్కరోజే 77,077 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. 27,241 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.3.47 కోట్ల ఆదాయం లభించింది.

# మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ

పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును మజ్లిస్ పార్టీ వ్యతిరేకించింది. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. సభలో వివిధ పార్టీలు డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాయి. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారు. ఈ బిల్లును నిరసిస్తూ ఆయన సాహిర్ లుధియాన్వి రాసిన ఒక కవితను లోక్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ముస్లిం ప్రాతినిథ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆరోపించారు. ఈ బిల్లు జనాభా ఎక్కువగా ఉన్నరాష్ట్రాలకు మరింత అధికారం ఇస్తుందని అన్నారు. డీలిమిటేషన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ, బిల్లు ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. దక్షిణాది ప్రాంతాలకు సభలో ప్రాతినిథ్యం లేకుండా ఈ బిల్లు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే సహా వివిధ పార్టీలు వ్యతిరేకించాయి.

# మత్తు మందు చల్లి.. సినీ ఫక్కీలో రూ.10 లక్షల చోరీ


కందుకూరు: రంగారెడ్డి జిల్లా కందుకూరులో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. ఎస్ బీఐ నుంచి రూ.10లక్షల నగదును విత్‌డ్రా చేసుకుని ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు అనుసరించి, మత్తుమందు చల్లి నగదు అపహరించారు. పోలీసులు, బాధితుడు వెల్లడించిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడ గ్రామానికి చెందిన ఢిల్లీ నారాయణ వ్యవసాయంతో పాటు పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. గురువారం అవసరాల నిమిత్తం కందుకూరు ఎస్బీఐ బ్యాంకు నుంచి రూ.10 లక్షలు విత్డ్రా చేసి, నగదును ద్విచక్రవాహనం డిక్కిలో పెట్టుకుని గ్రామానికి పయనమయ్యాడు. బ్యాంకు నుంచే పసిగట్టిన దుండగులు కందుకూరు గ్రామం దాటిన తర్వాత అతడిపై మత్తుమందు చల్లి.. నగదు ఆపహరించుకెళ్లారు. మత్తులోకి వెళ్లిన నారాయణ విషయాన్ని గుర్తించలేకపోయారు. కానీ, ఇంటికి వెళ్లిన తర్వాత డిక్కిలో డబ్బులు చూస్తే లేకపోవడంతో ఆశ్చర్యానికి గురయ్యాడు. మత్తు నుంచి తేరుకున్న తర్వాత బంధువులు వచ్చి బ్యాంకుతో పాటు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. నలుగురు వ్యక్తులు ఆయన్ని అనుసరించి.. దారిలో అపహరించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# తేజస్వీ సూర్యపై కల్వకుంట్ల కవిత నిప్పులు.

పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కార్చిచ్చు రేపాయి. ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా వేదికగా తేజస్వి సూర్యపై విరుచుకుపడ్డారు. నిండు పార్లమెంట్‌లో తెలంగాణ అస్తిత్వాన్ని, అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు ఎంత ధైర్యం ఉంటే తెలంగాణ ఏర్పాటును ఒక విద్వేషపూరిత విభజనతో పోలుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తేజస్వి సూర్య తన ఎంపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ అంటే ఒక పోరాటమని, కోట్లాది మంది కలల సాకారమని... అటువంటి పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి బీజేపీ అగ్రనేతలు ఈ వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని కవిత ప్రశ్నించారు. సొంత రాష్ట్రాన్ని అవమానిస్తుంటే అడ్డుకోని వారు పదవుల్లో ఉండటానికి అనర్హులని, తెలంగాణ ప్రజలకు వారు సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య



హన్మకొండ జిల్లా, పరకాలలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. భర్తను అతి కిరాతకంగా చంపి, ఆధారాలు దొరక్కుండా పెట్రోల్ పోసి తగులబెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పరకాలకు చెందిన సుమన్ ఒక రెస్టారెంటులో పని చేస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు. భార్యకు కమలాపూర్ మండలం వంగపల్లికి చెందిన ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో తన భర్తను వదిలించుకోవాలనుకున్న లావణ్య, ప్రియుడితో కలిసి చంపేందుకు ప్లాన్ వేసింది. ఇందుకోసం ఒక ముఠాకు సుఫారీ ఇచ్చింది. ఈ క్రమంలో ఆమె కొద్దిరోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. ఆ తర్వాత, ఈ నెల 3వ తేదీ నుంచి భర్త సుమన్ కనిపించకుండా పోయాడు. కొడుకు కోసం వెతికిన సుమన్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భార్యపై అనుమానం వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ జరపగా, ప్రియుడితో కలిసి భర్తను చంపినట్లు అంగీకరించింది. సుఫారీ గ్యాంగ్ మొదట అతనిని బీరు సీసాలతో విచక్షణారహితంగా పొడిచి చంపింది. ఈనెల 4వ తేదీన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దయ్యాలవాగు సమీపంలో సుమన్‌పై పెట్రోల్ పోసి కాల్చివేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, ఆ తర్వాత ఎనిమిది మందిని అరెస్టు చేశారు. లావణ్యతో పాటు ప్రియుడు, సుఫారీ తీసుకున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# డగ డగ డగ డగ.. ఈ శబ్దం ఉండదిక!

డగడగ శబ్దాలు... రైలు ప్రయాణికులకు ఇలాంటి అనుభవాలు మామూలే. రాత్రి సమయంలో నిద్రా భంగమూ అవుతుంటుంది. ముఖ్యంగా క్రాసింగ్లు, వంతెనలు వచ్చినప్పుడు ఈ సమస్యలు ఎక్కువ. వీటిపై చాలా సినిమాల్లో సెటైర్లు కూడా చూసి ఉంటాం. అన్నీ కుదిరితే త్వరలోనే ఆ చిక్కులన్నీ కనుమరుగు కానున్నాయి. సుఖవంతమైన ప్రయాణం అందరికీ అందుబాటులోకి రానుంది. దీనికోసం ప్రత్యేకంగా కంపోజిట్ స్లీపర్లను ఉపయోగించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. త్వరలో రైలు పట్టాలను సైతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానంతో పర్యవేక్షించనున్నారు. ఇటీవల ఢిల్లీలో రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ నేతృత్వంలో రైల్వేబోర్డు సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇవి కార్యరూపం దాలిస్తే.. తక్కువ వైబ్రేషన్స్ రైలు ప్రయాణం సాఫీగా సాగుతుంది. ట్రాక్ సమస్యలు ముందే గుర్తించడంతో ప్రయాణ ఆలస్యాలు గణనీయంగా తగ్గుతాయి.

**బరువు తక్కువ.. సామర్థ్యం ఎక్కువ**

రైల్వే ట్రాక్ లో ఇప్పటివరకు వాడుతున్న ఇనుము. కాంక్రీట్ స్లీపర్లకు బదులుగా కంపోజిట్ స్లీపర్లను రైల్వేశాఖ ప్రవేశపెట్టనుంది. ఇవి తక్కువ బరువుతో దృఢంగా ఉంటాయి. చదరపు సెం.మీ. పట్టా సుమారు 700 కిలోల లోడ్ సామర్థ్యం మోయగలదు. ఈ ట్రాక్లో లో మెరుగైన కుషనింగ్తో కదుపులు తక్కువగా ఉంటాయి. బ్రిడ్జ్ అప్రోచ్లు, క్రాసింగ్ల వద్ద ఈ స్లీపర్ల వినియోగాన్ని పెంచాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. వీటి మరమ్మతులూ తేలిక. నిర్వహణ ఖర్చు తక్కువ. సాధారణంగా ట్రాక్లో చిన్న లోపాలు కూడా ప్రమాదాలకు దారి తీస్తాయి. వీటిని అధిగమించేలా మాగ్నెటిక్ పార్టికల్ టెస్టింగ్ ప్రవేశపెట్టనున్నారు. సూక్ష్మ చీలికల్ని కూడా గుర్తించే సామర్థ్యం దీనికి ఉంది.

# తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝుర్వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి. ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు. బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు. ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తేజస్వి సూర్య వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరిస్తున్నారు



తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు కావాలనే రాజకీయ లబ్ధి కోసం వక్రీకరిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు మండిపడ్డారు. తేజస్వి సూర్య ఉద్దేశం తెలంగాణను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు. విభజన సమయంలో చోటుచేసుకున్న అశాస్త్రీయ పరిణామాలను ప్రస్తావించి ఉండవచ్చని, దానిని బీఆర్ఎస్ నేతలు తమకు అనుకూలంగా మలుచుకుంటూ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో నాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ సంపూర్ణ మద్దతు ఇవ్వబట్టే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని... బీజేపీ లేకుంటే తెలంగాణ వచ్చేదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో లోక్‌సభలో బీఆర్ఎస్‌కు (నాడు టీఆర్ఎస్) కనీసం ఇద్దరు సభ్యులు కూడా లేరని, కేవలం తమ పార్టీ మద్దతుతోనే బిల్లు పాస్ అయిందన్న నిజాన్ని గ్రహించాలని గుర్తు చేశారు. రాష్ట్రం ఇచ్చామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఎన్నోసార్లు యూటర్న్‌లు తీసుకుందని, ఆ పార్టీ ద్వంద్వ వైఖరి వల్లే ఉద్యమం సుదీర్ఘకాలం సాగిందని రాంచందరర్ రావు ఆరోపించారు.

# తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు

తెలంగాణ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై ఆమె తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెంచే ప్రక్రియలో భాగంగా తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణకు ఉన్న 3.13 శాతం ప్రాతినిధ్యాన్ని బేస్‌లైన్‌గా పరిగణించాలని, పునర్విభజన తర్వాత కూడా ఈ శాతం తగ్గకుండా చూడాలని కవిత డిమాండ్ చేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినప్పటికీ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ప్రాతినిధ్యం తగ్గితే అది ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కవిత అసహనం వ్యక్తం చేశారు.

# అనాథ ఆడబిడ్డలకు సిజిఆర్ అండ

సబ్బండనాదం/ఏప్రిల్ 16 గుమ్మడిదల

మున్సిపాలిటీ పరిధిలోని చాకలి దుర్గేష్ అకాల మరణంతో ఆనాథ లైన ఆడబిడ్డలకు అండగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమె 50 వేల ఆర్థిక సహాయం అందించారు. చాకలి దుర్గేష్ అకాల మరణంతో కుటుంబం తీవ్ర విషాదచాయలు అలుముకున్న విషయం తెలుసుకున్న గోవర్ధన్ రెడ్డి గురువారం మృతుడి ఇంటికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. దుర్గేష్ కుమార్తెలైన ప్రవళిక, లిఖితల పేరిట ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున పోస్టాఫీసులో డిపాజిట్ చేయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ అవసరాల కోసం నగదు సాయం అందజేసి, భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, నాయకులు వెంకట్రాంరెడ్డి, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, భాస్కర్, ట్రస్ట్ సభ్యులు తదీతరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమీక్ష



సబ్బండ నాదం / ఏప్రిల్ 16 గుమ్మడిదల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన గుర్తించి పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామాభివృద్ధికి సమిష్టి కృషి అవసరం గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నదని, వాటి అమలులో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. లిఅభివృద్ధి పనులపై సమీక్ష లి అనంతరం మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని అధికారులు వివరించగా, తగు సలహాలు సూచనలు అందజేశారు గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచులు సమావేశంలో ప్రస్తావించగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అఖిలేశ్ రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కానుకుంట సర్పంచ్ పెంటారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక దృష్టి




సబ్బండనాదం/ఏప్రిల్ 16 గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 12 వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ప్రత్యేక దృష్టి కేటాయించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై స్థానిక నాయకులతో కలిసి వార్డు అంతటా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా లోపాలు, సీసీ రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థలో ఉన్న సమస్యలు, వీధి దీపాల పనితీరు వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యలను కేవలం ఫైళ్లలో కాకుండా ప్రత్యక్షంగా చూసి పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఆయన ప్రతి ప్రాంతాన్ని సందర్శించడం విశేషం ప్రజలతో నేరుగా మాట్లాడిన చైర్మన్, వారి ఇబ్బందులను తెలుసుకుని వెంటనే స్పందించారు. సమస్యల పరిష్కారానికి ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు. "ప్రజలే మా బలం... వారి సమస్యలే మా బాధ్యత" అని పేర్కొన్న చైర్మన్, ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి అభ్యర్థనలను వినిపించుకోవడం తమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ కత్తుల రమేష్, ఆకుల సత్యనారాయణ, వెంకట్రాం రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కో–ఆప్షన్ సభ్యుల నియామక నోటిఫికేషన్



సబ్బండ నాదం/ఏప్రిల్ 16 గుమ్మడిదల మున్సిపా లిటీలో నాలుగు కో ఆప్షన్ సభ్యుల పదవుల భర్తీకి మున్సిపల్ కమిషనర్ దశరథ్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పురపాలక సంఘం నిబంధనల ప్రకారం మొత్తం నలుగురిని రెండు కేటగిరీల కింద ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ వ్యవహారాల్లో అనుభవం గలవారు ఇద్దరు, మైనారిటీ వర్గాలకు చెందిన మరో ఇద్దరిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కేటగిరీలో ఒక మహిళకు అవకాశం కల్పించాలని నిబంధన ఉన్నట్లు తెలిపారు . దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 21 సంవత్సరాల వయస్సు నిండి, స్థానిక మున్సిపల్ ఓటర్ ఉండాలని పేర్కొన్నారు. ఇది వరకు కౌన్సిలర్ గా , సర్పంచ్ గా లేదా ఎంపీటీసీగా కనీసం ఐదేళ్ల పరిపాలనా అనుభవం ఉన్నవారు లేదా గెజిటెడ్ హోదాలో పనిచేసి పదవీ విరమణ పొందిన వారు అర్హులుగా ఉంటారని తెలిపారు. అర్హత కలిగిన వారు ఆసక్తి కలవారు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవలసిందిగా సూచించారు.

# మహిళా బిల్లు.. భారత రాజకీయాల్లో నవశకం!




భారత ప్రజాస్వామ్య చరిత్రలో దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' ఒక చరిత్రాత్మక మలుపు. ఇది కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అబలలు సబలలుగా మారి, దేశ విధాన నిర్ణయాల్లో భాగస్వాములయ్యే సరికొత్త నవశకానికి నాంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. అయితే, జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల ప్రాతినిధ్యం చట్టసభల్లో మాత్రం దశాబ్దాలుగా నామమాత్రంగానే ఉండిపోయింది. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రయాణం ఒక సుదీర్ఘ పోరాటం. దాదాపు 27 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఇది చట్టంగా మారనున్నది. ఈ అసమానతను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మహిళా రిజర్వేషన్ బిల్లు భారత రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుంది. 'ఎక్కడ మహిళలు పూజించబడతారో.. అక్కడ దేవతలు కొలువై ఉంటారు' అన్న సూక్తిని అక్షరాలా అమలు చేసిన పార్టీ తెలుగుదేశం. ఆనాడు ఎన్టీఆర్ అడుగడుగునా మహిళలకు ఆత్మగౌరవాన్ని పంచితే, చంద్రబాబు ఆధునిక సాంకేతికతను, ఆర్థిక వనరులను జోడించి మహిళలను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి స్ఫూర్తినిచ్చిన ఎన్నో విప్లవాత్మక మార్పులు దశాబ్దాల క్రితమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదలయ్యాయి. నేడు పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందనున్న తరుణంలో, తెలుగు నేలపై మహిళల కోసం జరిగిన ఎన్నో విప్లవాత్మక మార్పులు దేశానికే దిశానిర్దేశం చేస్తున్నాయనడంలో సందేహం లేదు. తెలుగు రాష్ట్రాల్లో మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఇంత చైతన్యవంతంగా ఉండటానికి ఆనాడు ఎన్టీఆర్ వేసిన పునాదే కారణం. మహిళలకు అనేక పథకాలు ప్రకటించి ఆయన మహిళల పక్షపాతిగా నిలిచారు. ఎన్టీఆర్ కేవలం మాటలతో సరిపెట్టకుండా, చేతల్లో మహిళా సాధికారతను చూపించారు. దేశం మొత్తం మహిళా హక్కుల గురించి చర్చించక ముందే, 1986లో హిందూ వారసత్వ చట్టానికి సవరణ చేసి, ఆస్తిలో కుమార్తెలకు సమాన వాటా కల్పించిన ఘనత ఎన్టీఆర్‌ది. సంపూర్ణ మద్యపాన నిషేధంతో కుటుంబ సంక్షేమం కోసం భద్రత కల్పించారు. దేశంలో మొదటిసారిగా రాష్ట్రంలో మహిళలకు ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మహిళల ఉన్నత విద్యాభ్యాసం కోసం తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, విద్యారంగంలో విప్లవం తెచ్చారు. రాజకీయాల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని భావించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు మొట్టమొదటిసారిగా తొమ్మిది శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని శాసనకర్తలుగా మార్చిన దార్శనికత ఎన్టీఆర్‌ది. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ మహిళలకు రిజర్వేషన్ కల్పించడం, చేయదగిన ప్రభుత్వ ఉద్యోగాల్లో 30శాతం వారికే కేటాయించారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థినులకు 33శాతం రిజర్వేషన్ కల్పించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మహిళలకు తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణాల ద్వారా వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించారు. ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు హయాం వరకు మహిళాభివృద్ధి కోసం వారు చేసిన నిరంతర కృషి ఫలితమే నేడు జాతీయ స్థాయి మహిళా రిజర్వేషన్ బిల్లు రూపం దాల్చడం. మహిళల నేతృత్వంలో అభివృద్ధిని సాకారం చేసే ఈ చారిత్రక చట్టం ద్వారా దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం మరింత బలపడుతుంది. ఎన్టీఆర్ కల్పించిన చట్టబద్ధమైన హక్కులకు ఆర్థిక బలాన్ని జోడించిన వ్యక్తి చంద్రబాబు. మహిళలను ఓటు బ్యాంకుగా కాకుండా, ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ఆయన లక్ష్యం. గడప దాటని మహిళలను సంఘటితం చేసి పొదుపు మంత్రాన్ని నేర్పి, ప్రపంచంలోనే అతిపెద్ద స్వయం సహాయక బృందాల వ్యవస్థగా డ్వాక్రాను తీర్చిదిద్ది, ప్రతి మహిళను ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చిన వ్యక్తి చంద్రబాబు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసి, లక్షలాది మహిళలను సర్పంచులుగా, జడ్పీటీసీలుగా తీర్చిదిద్ది రాజకీయ ఓనమాలు నేర్పారు. బాలిక జననంపై రూ.5,000 ఫిక్స్‌డ్ డిపాజిట్, దేశంలోనే తొలి మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు, మహిళల అక్షరాస్యత 25.27శాతం నుంచి గణనీయంగా పెరిగేలా చర్యలు తీసుకున్నారు. మహిళా కమిషన్ ఏర్పాటు, దేశంలోనే తొలి మహిళా స్పీకర్ నియామకం, దేశంలోనే మొదటిసారిగా మహిళా పార్లమెంటు సదస్సు నిర్వహణ, 93 లక్షల మంది మహిళలకు పసుపు--కుంకుమ పథకం తెచ్చారు. పొగచూరిన వంటిళ్ల నుంచి ఆడబిడ్డలకు విముక్తి కలిగించడానికి దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్యాన్ని కాపాడారు. ఉద్యోగాల్లో 33శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్, 1,20,000 మంది మహిళలు ప్రజాప్రతినిధులు, 15 లక్షల మంది విద్యార్థినులకు ఉచిత సైకిళ్లు, అన్న అమృత హస్తం కింద 10 లక్షల మంది మహిళలకు పోషకాహారం అందించారు. మహిళల పేరుమీద ఇళ్లపట్టాలు, కుట్టు మిషన్లు, రోజుకు 15--25 లక్షల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు.

ఒంటరి మహిళలకు, వితంతువులకు ఇచ్చే పెన్షన్లను భారీగా పెంచి వారికి అండగా నిలిచారు. చంద్రన్న పెళ్లి కానుక ద్వారా పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక భరోసా కల్పించారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రతిపాదన దాదాపు 27 ఏళ్లుగా వాయిదా పడుతోంది. దేవెగౌడ ప్రభుత్వ హయాం (1996)లో మొదటిసారి 81వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఏకాభిప్రాయం లేక వీగిపోయింది. తర్వాత 1998, 1999, 2002, 2003లో అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం ప్రయత్నించినా, విపక్షాల అభ్యంతరాల వల్ల బిల్లు ఆమోదం పొందలేదు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో 2010లో రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అయితే లోక్‌సభలో పెండింగ్‌లో పడింది. 2014లో లోక్‌సభ రద్దు కావడంతో ఆ బిల్లు కూడా రద్దయింది. తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 2023లో కొత్త పార్లమెంట్ భవనంలో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టింది. సెప్టెంబర్ 20, 2023న లోక్‌సభలో, సెప్టెంబర్ 21న రాజ్యసభలో బిల్లు దాదాపు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ 33శాతం రిజర్వేషన్ల బిల్లును నేడు లోక్‌సభలో ఆమోదించి, 2029 సాధారణ ఎన్నికల నాటికి అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహిస్తున్నది. మహిళా బిల్లు అమలుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలకు, ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు.

# అభివృద్ధికి నోచుకోని నల్లవల్లి

–ప్రజాప్రతినిధుల ఆవేదన



సబ్బండనాదం/ఏప్రిల్ 16 గుమ్మడిదల

మండల పరిదిలోని నల్లవల్లి గ్రామం అభివృద్ధి దిశగా ఇంకా అడుగులు వేయలేక పోతుందని స్థానిక వార్డు సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కనీసం మౌళిక వసతులైన రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి వ్యవస్థ ఇంకా సరైన స్థాయిలో లేకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని రహదారులు దెబ్బతిని, రాకపోకలు కష్టసాధ్యంగా మారుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే డ్రైనేజ్ సమస్యలు పెరిగిపోవడంతో ఈగలు దోమల వల్ల, సిజనల్ వ్యాధులు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడం బాధాకరమని వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ అభివృద్ధికి కేటాయించిన నిధులు ఎక్కడికి వెళ్తున్నాయో స్పష్టత లేదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి నల్లవల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


# పాదచారుల సేద తీర్చేందుకు చలివేంద్రం



సబ్బండనాదం/ఏప్రిల్ 16 గుమ్మడిదల

మండల పరిది లోని కానుకుంట గ్రామంలో పోతరాజు సుధాకర్ తల్లి తండ్రుల జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బస్ స్టాప్ లో కీ.శే. పోతురాజు బాలనర్సయ్య, నర్సమ్మ జ్ఞాపకార్ధముగా పోతురాజు సుధాకర్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి ప్రారంభించారు. గత 15 సంవత్సరాలుగా ప్రతి వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నా సుధాకర్ సేవలను అభినందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నకాలంలో ప్రక్కనే గల ఆసుపత్రికి వచ్చే రోగులు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగ పడు తుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని సుదాకర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాషా, గ్రామ పీఆర్ఓ సంతోష్, వార్డు సభ్యులు ఎర్రోళ్ల శంకర్, తుడుం ప్రభాకర్, నాయకులు కుమ్మరి వెంకటేష్, భార్గవచారి, విశాల్ గౌడ్, శ్రీశైలం, సాకలి మురళి, రమేష్, పోచయ్య, గ్రామ పెద్దలు శంకరయ్య, బాలరాం, యువకులు నాగరాజు, ప్రభాకర్, సాయి, నరేష్ కుమార్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

# లాభాల నుంచి నష్టాల్లోకి.. స్టాక్ మార్కెట్లకు నష్టాలు..




గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో దేశీయ సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఉదయం లాభాలతో ప్రారంభమై చివరకు నష్టాలతో ముగిశాయి. ఆటో, ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంకింగ్ రంగాల్లో అమ్మకాలు కూడా సూచీలను కిందకు లాగాయి. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠంతో పోల్చుకుంటే ఏకంగా 750 పాయింట్లను కోల్పోయింది గత సెషన్ ముగింపు (78,111)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ మధ్యాహ్నం వరకు లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత కిందకు వచ్చి ఇక కోలుకోలేకపోయింది. చివరకు సెన్సెక్స్ 122 పాయింట్ల నష్టంతో 77,988 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 34 పాయింట్ల నష్టంతో 24,196 వద్ద స్థిరపడింది సెన్సెక్స్, నిఫ్టీలో భెల్, అదానీ పవర్, సీజీ కన్స్యూమర్, పీబీ ఫిన్‌టెక్, కేన్స్ టెక్నాలజీస్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి సుప్రీమ్ ఇండస్ట్రీస్, అస్ట్రాల్ లిమిటెడ్, జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్, హీరో మోటోకార్ప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 215 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 369 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 93.20గా ఉంది.


# కాంక్రీటు నేలపై మొలకెత్తిన మొక్క జీవితానికి ప్రేరణ

-- సబ్బండ నాదం ప్రత్యేకం

గుంటూరు జిల్లా, అడవితక్కెళ్ళపాడు: గ్రామీణ సాహిత్యానికి వేదికగా నిలుస్తున్న సబ్బండనాదం తెలుగుదినపత్రిక వడ్డెర కవుల రచనలను గుర్తించి ప్రచురిస్తూ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో అడవితక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన రచయిత దేరంగుల రమణ రచించిన ఓ ప్రేరణాత్మక కథనం పాఠకులను ఆకట్టుకుంటోంది. "కాంక్రీటు నేలపై మొలకెత్తిన మొక్కను చూశారా?" అనే ప్రశ్నతో ప్రారంభమయ్యే ఈ కథనం, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఎదగాలనే సంకల్పాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. చుట్టూ అనుకూల పరిస్థితులు లేకపోయినా, కొద్దిపాటి మట్టిని ఆధారంగా చేసుకుని, వాన చినుకులను జీవధారగా మార్చుకుని ఎదిగిన ఒక మొక్కను ఉదాహరణగా చూపిస్తూ రచయిత జీవిత సత్యాన్ని తెలియజేశారు. జీవితం ఎప్పుడూ అనుకూలంగా ఉండదని, కొన్నిసార్లు అది కాంక్రీటులా కఠినంగా మారుతుందని రచనలో పేర్కొన్నారు. ఉద్యోగ నష్టాలు, సంబంధాలలో విభేదాలు, ఆర్థిక ఇబ్బందులు వంటి పరిస్థితుల్లో మనిషి రెండు మార్గాల మధ్య నిలబడతాడని --- ఒకటి నిరాశతో ఆగిపోవడం, మరొకటి ఉన్న పరిస్థితుల్లోనే ఎదగడానికి ప్రయత్నించడం --- అని వివరించారు. ఈ కథనం ద్వారా ప్రతికూలతలను అవకాశాలుగా మలచుకోవాలనే సందేశాన్ని రచయిత అందించారు. ఓటమిని పాఠంగా, విమర్శను ప్రేరణగా, ఒంటరితనాన్ని స్వీయ నిర్మాణానికి మార్గంగా మార్చుకోవచ్చని సూచించారు. మొక్క చిన్న పగుళ్లలోనూ పెరిగినట్లే, మనిషి కూడా అవకాశాల్లోని చిన్న మార్గాలను గుర్తించి ముందుకు సాగాలని ఈ రచన ప్రేరేపిస్తోంది. నిరాశ పడటం సులభమైతే, నిలబడి పోరాడటమే నిజమైన గొప్పతనం అని కథనం స్పష్టం చేస్తోంది. మొక్కకు ఫలాలు ఇవ్వడం ధర్మమైతే, మనిషికి పరిస్థితులను జయించడం ధర్మమని ఈ రచన తాత్పర్యంగా చెబుతోంది. అనుకూల పరిస్థితుల కోసం ఎదురు చూడకుండా, ఉన్న చోటే ఎదగాలని పాఠకులకు పిలుపునిస్తోంది. ఈ కథనం పాఠకుల్లో చైతన్యం నింపుతూ, జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# వేగంగా తినే అలవాటు బరువు పెరగడానికి కారణమవుతుందా?



ఇంటర్నెట్ డెస్క్: ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో చాలా మంది భోజనం కూడా తొందరగా ముగించేస్తున్నారు. పని ఒత్తిడి, సమయం కొరత కారణంగా తినే విధానం మారిపోయింది. కానీ ఇలా వేగంగా తినడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీరు వేగంగా తిన్నప్పుడు, కడుపు నిండిందనే సంకేతం మెదడుకు చేరడానికి సమయం పడుతుంది. దీంతో అవసరానికి మించి ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. ఇది క్రమంగా బరువు పెరగడానికి, ఊబకాయానికి దారితీస్తుంది. అదేవిధంగా, ఆహారాన్ని సరిగా నమలకపోవడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. దీని వల్ల అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

**ఇతర ఆరోగ్య సమస్యలు:**

వేగంగా తినే అలవాటు వల్ల ఎక్కువ కేలరీలు తీసుకునే అవకాశం ఉంటుంది. గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. ఇన్సులిన్ అసమతుల్యత వల్ల టైప్-2 మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. హార్మోన్ అసమతుల్యత, అలసట పెరుగుతాయి. ఈ అలవాటు ఎక్కువకాలం కొనసాగితే శరీరంలో కొవ్వు పేరుకుపోయి మెటబాలిజం కూడా మందగిస్తుంది. నెమ్మదిగా, శ్రద్ధగా భోజనం చేయాలి. ఆహారాన్ని బాగా నమలాలి. టీవీ, మొబైల్ చూస్తూ తినడం మానుకోవాలి. క్రమబద్ధమైన సమయాల్లో తినాలి. జంక్ ఫుడ్ తగ్గించి పండ్లు, కూరగాయలు, ప్రోటీన్, ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోవాలి రోజూ వ్యాయామం చేయాలి. తగినంత నిద్రపోవాలి. వేగంగా తినడం ఒక చిన్న అలవాటు అనిపించినా, అది ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతుంది. కాబట్టి నెమ్మదిగా తినే అలవాటు పెంచుకుంటే బరువు నియంత్రణతో పాటు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# అమెరికాతో మళ్లీ వాణిజ్య చర్చలు.

అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా భారత్ మరో కీలక అడుగు వేయబోతోంది. ఈ నెలలో భారత ప్రతినిధి బృందం వాషింగ్టన్‌కు వెళ్లి చర్చలు జరపనుంది. అమెరికాలో మారుతున్న టారిఫ్ విధానాలు, అంతర్జాతీయంగా సరఫరా గొలుసుల్లో వచ్చిన అంతరాయాల నేపథ్యంలో జరగబోయే ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏప్రిల్ 20న వాషింగ్టన్‌కు ఒక వాణిజ్య ప్రతినిధి బృందాన్ని భారత్ పంపనుంది. ఈ ప్రతినిధి బృందానికి ప్రధాన సంధాన కర్త దర్పణ్ జైన్ నేతృత్వం వహించనున్నారు 'ప్రధాన సంధానకర్త నేతృత్వంలోని భారత బృందం ఈ నెల 20వ తేదీ నుంచి అమెరికాలో పర్యటించనుంది. సుమారు 3-4 నెలల విరామం తర్వాత సంప్రదింపుల బృందాలు ప్రత్యక్షంగా సమావేశం కానున్నాయి. ఈ మధ్యకాలంలో వారు వర్చువల్‌గా సంప్రదింపులు జరుపుతూ వచ్చారు' అని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ తెలిపారు. ఫిబ్రవరి 7న విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనకు కొనసాగింపుగా, చట్టపరమైన ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా ఇది మరో అడుగని ఆయన పేర్కొన్నారు . ఆ ప్రకటనను చట్టపరమైన ఒప్పందంగా ఖరారు చేయడానికి మరిన్ని చర్చలు, తదుపరి సంప్రదింపులు అవసరమని రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు ఈ ఒప్పందం కుదిరితే రెండు దేశాల మధ్య వాణిజ్యం మరింత పెరుగుతుంది. టెక్నాలజీ, ఎనర్జీ, వ్యవసాయ రంగాల్లో సహకారం పెరుగుతుంది. గ్లోబల్ సరఫరా గొలుసుల్లో భారత్‌కు బలం చేకూరుతుంది. అమెరికాతో ట్రేడ్ డీల్‌ను వేగవంతం చేయడానికి భారత్ చేస్తున్న ఈ తాజా ప్రయత్నం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలపరిచే అవకాశముంది.

# ఓటేయుని సభ్యులు 104?

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ బిల్లులను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు విపక్షం ఓటింగ్‌కు పట్టుబట్టింది. దాంతో స్పీకర్ ఓం బిర్లా డివిజన్‌కు అనుమతించారు. గురువారం సభకు 104 మంది సభ్యులు హాజరు కాలేదు. సభలో 543 సీట్లు ఉండగా 3 సీట్లకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుత బలం 540 మంది సభ్యుల్లో కేవలం 436 మంది హాజరయ్యారు. అందులో 251 మంది బిల్లులను ప్రవేశపెట్టడానికి అనుకూలంగా ఓటేశారు. 185 మంది వ్యతిరేకంగా ఓటేశారు. దాంతో విపక్షాల అభ్యంతరం వీగిపోయింది. బిల్లుపై చర్చ మొదలైంది. రాజ్యాంగ సవరణ బిల్లులను సభలో ప్రవేశ పెట్టడానికి సాధారణ మెజారిటీ చాలు. నెగ్గించుకొనే సమయంలో 2/3 మెజారిటీ అవసరం. లోక్‌సభలో నిజానికి ఎన్డీఏ బలం 293. అంటే, ఎన్డీయే సభ్యులే 42 మంది రాలేదు. ఇతర పక్షాల నుంచి మరో 62 మంది రాలేదు. నిజానికి బీజేపీ, కాంగ్రెస్ సహా పలు పార్టీలు మూడు రోజులు సభకు హాజరు కావాల్సిందేనని విప్ జారీ చేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బిజీగా ఉన్న బెంగాల్, తమిళనాడు ఎంపీలు అన్ని పార్టీల వారు సభకు రాలేదు. వామపక్షాల సభ్యులు కూడా గురువారం సభకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతకీలకమైన బిల్లుకు 104 మంది సభ్యులు రాకపోవడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. అయితే, 2/3 మెజారిటీకి(260o1) చాలా దూరంలో ఉన్న ఎన్డీఏ ఈ బిల్లును నెగ్గించుకోవాలంటే 2/3 మెజారిటీ ఫిగర్‌ను 291కి తగ్గించాలి. అందుకోసం ప్రస్తుతం సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 104 మంది విపక్ష హాజరు కాకుంటే సరిపోతుంది. గురువారం నాటి గైర్హాజరు శాంపిల్ శుక్రవారం జరగబోయే పరిణామాలకు సూచన కావొచ్చనే ఊహాగానాలు సాగుతున్నాయి.

# ప్రజాస్వామ్యంపై కేంద్రం ప్రత్యక్ష దాడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, మీడియాను అణిచివేస్తూ ప్రజాస్వామ్యంపై పరోక్ష దాడి చేస్తూ వచ్చిన కేంద్రప్రభుత్వం.. ఇప్పుడు ఏకంగా ప్రత్యక్ష దాడికి దిగిందని కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ ఆరోపించారు. ముగ్గురు సభ్యులతో ఏర్పాటయ్యే పునర్విభజన కమిషన్.. రాష్ట్రాల తలరాతను, పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యాన్ని నిర్ణయించటం ఏమిటన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును భవిష్యత్తులో జరిగే నియోజకవర్గాల పునర్విభజనతో ఎందుకు ముడిపెట్టారని, ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 సీట్ల ఆధారంగానే ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. మహిళా బిల్లుకు తమ మద్దతు కొనసాగుతుందని, అయితే, ప్రభుత్వ ఉద్దేశాలపైనే సందేహంగా ఉందని చెప్పారు. అధికారపక్షం ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై లోక్‌సభలో గురువారం జరిగిన చర్చ సందర్భంగా కేంద్రంపై ప్రియాంక నిప్పులు చెరిగారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందితే దేశంలో ప్రజాస్వామ్యం అంతమైనట్లేనని చెప్పారు. మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని, అయితే, చర్చ దానిపై కాదని, ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిన తీరుపైనే చర్చ జరుగుతోందని ప్రియాంక స్పష్టం చేశారు. '2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభలో సీట్లు 850కి పెరుగుతాయని చెబుతున్నారు. దాంట్లో 33 శాతం మహిళలకు కేటాయిస్తామంటున్నారు. పైకి చూస్తే ఇదంతా బాగానే ఉన్నట్లు ఉంటుంది. కానీ, లోపల రాజకీయ కోణాలున్నాయి. ముగ్గురు సభ్యులతో ఏర్పాటయ్యే పునర్విభజన కమిషన్ రాష్ట్రాల తలరాతను, వాటి ప్రాతినిధ్యాన్ని నిర్ణయించబోతోంది. ఇది దేశ ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడే' అని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్‌పై ఘనమైన మాటలు చెబుతూ మరోవైపు ఓబీసీల హక్కులను లాగేసుకుంటున్నారని, వచ్చే ఎన్నికల నాటికి చిన్న రాష్ట్రాల ప్రభావం లేకుండా వ్యవస్థలను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని ముక్కలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మొత్తం పథకం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాదేనని ప్రియాంక విమర్శించారు. దీనిపై సభలో ఉన్న అమిత్‌షా నవ్వులు చిందించటంతో.. 'మీరు నవ్వుతున్నారు. కానీ, చాణక్యుడు జీవించి ఉంటే మీ కుటిల రాజకీయాల్ని చూసి మ్రాన్పడిపోయేవారు. ఈ విషయం మీరు కూడా ఒప్పుకుంటారు' అంటూ ప్రియాంక వ్యాఖ్యానించారు. ఓవైపు పలు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు సమావేశాలు నిర్వహించటం ప్రభుత్వ పథకంలో భాగమని, దాంట్లో భాగంగానే అఖిలపక్ష భేటీ కూడా జరపలేదని, సమావేశాలకు కేవలం ఒక్కరోజు ముందే బిల్లుల ప్రతులను ప్రతిపక్షాలకు అందజేశారని తెలిపారు

# మోదీ సర్కారుకు అగ్ని పరీక్ష

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: పుష్కరకాలంగా ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్రమోదీ.. పార్లమెంట్‌లో శుక్రవారం తొలిసారి అగ్నిపరీక్షను ఎదుర్కోబోతున్నారు. మోదీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు పై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు లోక్‌సభలో ఓటింగ్ జరుగుతుండగా, శనివారం రాజ్యసభలో ఈ బిల్లులు చర్చకు రానున్నాయి. గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో విపక్షాలన్నీ ఈ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్ అంశాన్ని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం సరైంది కాదని.. కాంగ్రెస్ నేతలు ప్రియాంకాగాంధీ, కేసీ వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే నేత రాజా, శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ తదితరులు స్పష్టం చేశారు. లోక్‌సభలో మోదీ సర్కారుకు ఓటమి తప్పదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. గురువారం ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఫ్లోర్ లీడర్లు సమావేశమై.. బిల్లులకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సంఘటితంగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలను ఏ విధంగా తమ వైపునకు తిప్పుకోవాలా అనే అంశంపై అధికార పక్షం దృష్టి సారించినట్టు సమాచారం. మరోవైపు.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ఛాంబర్ లో కేంద్రహోంమంత్రి తో పాటు పలువురు మంత్రులతో భేటీ అయి ఏ విధంగానైనా ఈ బిల్లులను ఆమోదం పొందేలా చూడాలని తెలిపారు. కనీసం 40 మంది విపక్ష సభ్యులు గైర్హాజరైతే ఏ సమస్యా ఉండదని బీజేపీ నేతలు చెప్పగా.. విపక్షాలతో మాట్లాడాలని, ఒక్కొక్క ఎంపీతో చర్చించాలని మోదీ సూచించినట్లు తెలిసింది. లోక్‌సభలో ప్రస్తుతం 541 మంది సభ్యులున్నారు. అందులో మూడింట రెండోవంతు మంది.. అంటే 360 మంది మద్దతునిస్తేనే మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులు ఆమోదం పొందుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఎన్డీఏకి ప్రస్తుతం 294 మంది సభ్యుల మద్దతు ఉన్నదని, వైసీపీ, చిన్న పార్టీలు, స్వతంత్రులతో కలిసి ఈసంఖ్య 305కు చేరుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. అంటే బిల్లు ఆమోదం పొందడానికి మరో 55 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే ప్రతిపక్ష శిబిరంలో చీలికలు తప్పవని.. పలువురు తమకు అనుకూలంగా ఓటు వేయడమో, లేక గైర్హాజరు కావడమో చేస్తారని బీజేపీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు అఖిలేశ్ యాదవ్‌తో మంతనాలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ మద్దతు పొందేందుకు కూడా తీవ్ర యత్నాలు జరుగుతున్నాయని అధికారపార్టీలోని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇక, రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందేందుకు 163 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా.. ఎన్డీఏకు 142 మంది మద్దతు ఉన్నదని, మరో 21 మంది మద్దతు సాధించవలిసి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. లోక్ సభలో బిల్లులు ఆమోదం పొందితే రాజ్యసభలో ఆమోదానికి ఎటువంటి సమస్యా ఉండదని ఈ వర్గాలు చెబుతున్నాయి. అన్ని రాష్ట్రాలకూ 50 శాతం సీట్లు పెంచుతామని బిల్లులో ఎక్కడున్నదని లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ప్రశ్నించినప్పుడు.. తాను హోంమంత్రిగా ఆ హామీ ఇస్తున్నానని అమిత్ షా చెప్పడం గమనార్హం. కులగణన గురించి సమాజ్ వాది పార్టీ నేత అఖిలేశ్‌యాదవ్ ప్రశ్నించగా.. వచ్చే జనగణనలో చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

# మెడ నొప్పి మెదడుకు హాని చేస్తుందా?

ఇంటర్నెట్ డెస్క్: ఇప్పటి జీవనశైలిలో మెడ నొప్పి చాలా మందికి సాధారణ సమస్యగా మారింది. ముఖ్యంగా రోజంతా కూర్చొని పనిచేసే వారు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను ఎక్కువగా ఉపయోగించే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. కొందరికి మెడ నొప్పితో పాటు తరచూ తలనొప్పి కూడా ఉంటుంది. అయితే ఈ మెడ నొప్పి మెదడుకు హాని చేస్తుందా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. నిపుణుల ప్రకారం, మెడలోని ఎముకలు (సర్వైకల్ వెర్టిబ్రా), డిస్కుల్లో మార్పులు వచ్చినప్పుడు నరాలపై ఒత్తిడి పడుతుంది. ఈ నరాలు మెదడుతో అనుసంధానమై ఉంటాయి కాబట్టి, ఆ ఒత్తిడి తలకు చేరి తలనొప్పి కలిగిస్తుంది. అందుకే మెడ నొప్పితో బాధపడే చాలా మందికి తలనొప్పి కూడా వస్తుంది. అయితే, సాధారణంగా మెడ నొప్పి వల్ల నేరుగా మెదడు దెబ్బతింటుందని చెప్పలేము. మెడ నొప్పి తీవ్రంగా ఉంటే, నరాలపై ఒత్తిడి పెరిగి నిరంతర తలనొప్పి లేదా మైగ్రేన్‌కు దారితీసే అవకాశం ఉంటుంది. కొందరిలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. ఎక్కువసేపు కూర్చొని పనిచేసే వారు, రోజూ బైక్‌పై ప్రయాణించే వారు, విటమిన్ ఙ, దీ12 లోపం ఉన్న వారు, మొబైల్‌ను ఎక్కువగా ఉపయోగించే వారు జాగ్రత్తగా ఉండాలి.

# మాస్‌చిప్ చేతికి వాయవ్య ల్యాబ్స్

హైదరాబాద్ (బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సెమీకండక్టర్ సంస్థ మాస్‌చిప్ టెక్నాలజీ.. కర్ణాటకలోని బెళగావికి చెందిన వాయవ్య ల్యాబ్స్‌లో 73 శాతం వాటాను రూ.245.49 కోట్లకు చేజిక్కించుకుంది. నగదు, ఈక్విటీ రూపంలో ఈ వాటాను కొనుగోలు చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. వాయవ్య ల్యాబ్స్ కొనుగోలుతో కంపెనీ సాఫ్ట్‌వేర్ ఆధారిత ఇంజనీరింగ్ సామర్థ్యాలను మరింత పటిష్ఠం చేయటంతో పాటు అంతర్జాతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరించే అవకాశం లభిస్తుందని మాస్‌చిప్ పేర్కొంది. ఎంబెడెడ్ సిస్టమ్స్, వర్చువలైజేషన్, వెరిఫికేషన్ టెక్నాలజీల్లో కీలకంగా ఉన్న వాయవ్య ల్యాబ్స్ ప్రస్తుతం బెంగళూరు, బెళగావిలో రెండు డెవల్‌పమెంట్ సెంటర్లను నిర్వహిస్తోంది.

# మార్క్ మొబియస్ కన్నుమూత



న్యూయార్: ప్రముఖ స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ మార్క్ మొబియస్ (89) మరిక లేరు. భారత్‌తో సహా అనేక వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్ల వృద్ధిపై అపార నమ్మకం ఉన్న మొబియస్ కన్నుమూశారు. భారత స్టాక్ మార్కెట్లో ర్యాలీ 50 ఏళ్ల పాటు కొనసాగుతుందని 2021లో ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రాల్లో పీహెచ్‌డీ చేసిన మొబియస్‌కు ప్రపంచ స్టాక్ మార్కెట్లపై 50 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఆసియాలోని భారత్, చైనా స్టాక్ మార్కెట్లతో పాటు రష్యా, వెనెజువెలా మార్కెట్లపైనా ఆయనకు గట్టి పట్టు ఉంది. ఇటీవలి వరకు ఆయన టెంపుల్టన్ ఎమర్జింగ్ మార్కెట్స్ గ్రూప్‌లో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పనిచేశారు.


# మళ్లీ 24,000 పైకి నిఫ్టీ




ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో ఈక్విటీ సూచీలు భారీగా లాభపడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 918.60 పా యింట్ల లాభంతో 77,550.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 275.50 పాయింట్ల వృద్ధితో 24,050.60 వద్ద ముగిసింది. బీఎ?సఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.6.44 లక్షల కోట్ల వృద్ధితో రూ.451.23 లక్షల కోట్లకు (4.87 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

## భారీగా క్రెడిట్ కార్డులు ఉన్నా..

# సిబిల్ స్కోర్ పొందడం ఎలా..?



న్యూఢిల్లీ, ఏప్రిల్16: మనీ పర్సులో ఎన్ని క్రెడిట్ కార్డులు ఉంటే అంత గొప్ప అని చాలా మంది అనుకుంటారు. కానీ ఇది తప్పని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్ కార్డును ఎంత నియంత్రణతో ఎలా వినియోగించామనే అంశాన్ని రుణ దాతలు పరిశీలిస్తారని స్పష్టం చేస్తున్నారు. ప్రతి నెల క్రెడిట్ కార్డును ఎలా వాడుతున్నారు. ఎంతలా వాడుతున్నారు. క్రమశిక్షణతో కూడిన నియంత్రణతో ఈ కార్డును వినియోగిస్తున్నారా? అనే అంశాన్ని రుణ దాతలు పరిశీలిస్తారని చెబుతున్నారు. ఒకటి కంటే ఎక్కువ కార్డులు కలిగి ఉండటం సమస్య కాదని జెట్ (జు) సహ వ్యవస్థాపకుడు, సీఈవో మనీశ్ షారా తెలిపారు. దీని వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కానీ మీరు క్రెడిట్ కార్డు వినియోగించే విధానంపై క్రెడిట్ స్కోరింగ్ ఆధారపడి ఉంటుందన్నారు. చాలా మంది వినియోగదారులు అక్కడే తప్పు చేస్తారని అంటున్నారు. ఎన్ని క్రెడిట్ కార్డులు ఉన్నా.. ఒక్కొక్క దానిని వినియోగించే విధానంపైనే అది ఉంటుందని చెబుతున్నారు. ఒకటి కంటే ఎక్కువ కార్డులు కలిగి ఉంటే.. వాటిని మనకు తగినట్లుగా వాడుకోవచ్చని ఫిక్స్‌మైస్కోర్, క్రెడ్‌జెనిక్స్ సహ వ్యవస్థాపకుడు ఆనంద్ అగర్వాల్ అభిప్రాయపడుతున్నారు. ఒకటి నిత్యావసరాల కోసం, మరొకటి ప్రయాణం కోసం, ఇంకోటి భారీ కొనుగోళ్ల కోసం వినియోగించకో వచ్చని సూచిస్తున్నారు. మీకు అధిక క్రెడిట్ పరిమితి ఉన్నప్పుడు.. మీ ఖర్చు దానిలో తక్కువ శాతంగా ఉంటుందని.. అది మీ క్రెడిట్ స్కోర్‌కు సహాయపడుతుందని వివరిస్తున్నారు. గడువు తేదీని గమనించడం, అధిక ఖర్చులను నివారించడంతోపాటు బిల్లులను పూర్తిగా చెల్లించడం వంటి క్రమశిక్షణ పాటించాలి. అలా అయితేనే ఎన్ని కార్డులు ఉన్నా.. మీ క్రెడిట్ ప్రొఫైల్‌ను బలోపేతం చేస్తాయని ఒలివ్ సహ వ్యవస్థాపకుడు, సీపీవో వినయ్ సింగ్ స్పష్టం చేస్తున్నారు.

# యుద్ధం వేళ.. ఎగుమతులు డీలా

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం భారత ఎగుమతులపై భారీ ప్రభావం చూపుతోంది. మార్చి నెలలో భారత వస్తు ఎగుమతులు 57.95 శాతం క్షీణించాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ బుధవారం తెలిపారు. భారత్ సాధారణంగా పశ్చిమాసియాకు ప్రతీ నెలా 600 కోట్ల డాలర్ల (రూ.55,800 కోట్లు) విలువైన వస్తువులను ఎగుమతి చేస్తుందని, యుద్ధం కారణంగా మార్చిలో ఇవి 350 కోట్ల డాలర్ల (రూ.32,550 కోట్లు) మేర తగ్గి 250 డాలర్ల (రూ.23,250 కోట్లు) స్థాయికి పరిమితమైనట్లు ఆయన చెప్పారు. ప్రధానంగా జెమ్స్ అండ్ జువెలరీ, ఎలక్ష?ట్రనిక్స్, ఇంజనీరింగ్, పెట్రోలియం ఉత్పత్తులు, బియ్యం ఎగుమతులపై అధిక ప్రభావం పడిందన్నారు. అంతేకాదు, పశ్చిమాసియా నుంచి భారత్‌కు దిగుమతులు సైతం 51.64 శాతం తగ్గాయన్నారు. కేంద్ర వాణిజ్య శాఖ బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో మొత్తం ఎగుమతులు కూడా వార్షిక ప్రాతిపదికన 7.44 శాతం తగ్గి 3,892 కోట్ల డాలర్లకు (సుమారు రూ.3.62 లక్షల కోట్లు) పడిపోయాయి. దిగుమతులు కూడా 6.51 శాతం తగ్గుదలతో 5,959 కోట్ల డాలర్లకు (రూ.5.54 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. ముడిచమురు, పసిడి దిగుమతులు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. వాణిజ్య లోటు 9 నెలల కనిష్ఠ స్థాయిలో 2,067 కోట్ల డాలర్లుగా (రూ.1.92 లక్షల కోట్లు) నమోదైంది. గత నెలలో ముడి చమురు దిగుమతులు 35.91 శాతం తగ్గి 1,218 కోట్ల డాలర్లకు (రూ.1.13 లక్షల కోట్లు) జారుకోగా.. పసిడి దిగుమతులు కూడా 31.63 శాతం తగ్గుదలతో 306 కోట్ల డాలర్లకు (రూ.28,458 కోట్లు) పరిమితమైనట్లు కేంద్రం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో అమెరికాను వెనక్కి నెట్టి భారత్‌కు అతిపెద్ద భాగస్వామిగా చైనా అవతరించింది. 2025-26లో భారత్-చైనా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 15,110 కోట్ల డాలర్లకు (రూ.14.05 లక్షల కోట్లు) పెరిగింది. చైనాకు భారత ఎగుమతులు 36.66 శాతం పెరిగి 1,947 కోట్ల డాలర్లకు (రూ.1.81 లక్షల కోట్లు) చేరగా.. చైనా నుంచి భారత్‌కు దిగుమతులు కూడా 16 శాతం పెరిగి 13,163 కోట్ల డాలర్లకు (రూ.12.24 లక్షల కోట్లు) ఎగబాకాయి. దాంతో చైనాతో భారత్ వాణిజ్య లోటు కూడా 11,216 కోట్ల డాలర్లకు (రూ.10.43 లక్షల కోట్లు) పెరిగింది. ఈ మార్చి 31తో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్స రం మొత్తానికి వస్తు, సేవల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 4.22 శాతం వృద్ధితో ఆల్‌టైం రికార్డు స్థాయి 86,009 కోట్ల డాలర్లకు (రూ.79.99 లక్షల కోట్లు) పెరిగాయని వాణిజ్య శాఖ వెల్లడించింది. అందులో వస్తు ఎగుమతు లు ఒక శాతం పెరుగుదలతో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 44,178 కోట్ల డాలర్లకు (రూ.41.09 లక్షల కోట్లు) చేరగా, సేవల ఎగుమతులు 41,831 కోట్ల డాలర్లుగా (రూ.38.90 లక్షల కోట్లు) నమోదయ్యాయి. కాగా, 2025-26లో వస్తు దిగుమతులు 7.45 శాతం పెరుగుదలతో 77,498 కోట్ల డాలర్లకు (రూ.72.07 లక్షల కోట్లు) చేరాయి. దాంతో వాణిజ్య లోటు 33,320 కోట్ల డాలర్లుగా (రూ.30.99 లక్షల కోట్లు) నమోదైంది. ట్రంప్ సుంకాలు, పశ్చిమాసియా యుద్ధం వంటి సవాళ్ల నేపథ్యంలోనూ గత ఆర్థిక సంవత్సరం ఎగుమతి వాణిజ్యంలో భారత్ మెరుగైన పనితీరు కనబరిచిందని రాజేశ్ అగర్వాల్ అన్నారు.